క్లుప్తంగా

పైపులైన్ పనులు ప్రారంభం

మానకొండూర్: మండలంలోని అన్నారం, చెంజర్ల గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం పీడబ్ల్యూఎస్ కింద మంజూరైన పైపులైన్ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. అన్నారంలో మూడు, చెంజర్లలో నాలుగు లక్షలతో పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనులు పూర్తయితే స్థానికులకు తాగునీటి అవసరాలు తీరనున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి దయాకర్ రావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ల

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని మోత్కులగూడెం అంబేడ్కర్ చౌరస్తా వద్ద టౌన్ సీఐ రవి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురిపై వివిధ కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న మిత్రులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుకొండ రమేశ్ ఇటీవల మృతి చెందగా బాల్యమిత్రులు మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం రూ.పదివేలు జమ చేసి కుటుంబ సభ్యులకు అందించి, మృతుడి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో బైరి కృష్ణ మహేందర్, రాజేందర్‌రెడ్డి, రాజేశ్, శ్రీకాంత్, కృష్ణ, కవిత, జ్యోతి రవళి, పద్మ సురేశ్, సునీత, మంజుల, ప్రణీత ఉన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు కృష్ణమూర్తి మనవడు ముక్క నివేశ్ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక: కిష్టంపేట గ్రామానికి చెందిన బొంగోని పోశయ్య(73) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద చెప్పులు, చేతి కర్ర ఉండటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు బావిలో వెతికారు. ఆదివారం శవాన్ని బయటికి తీశామని, మతిస్థిమితం సరిగా లేక ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడని మృతుడి మనువడు బొంగోని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన పెరక శ్రీనివాస్(50) గాయాల పాలయ్యాడు. వివరాలు... గట్టుదుద్దెనపల్లి గ్రామానికి ఆదివారం ఉదయం శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై వచ్చి పని ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

కరీంనగర్: కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ, ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని జిందాతిలిస్మాత్, పార్లే-జీ బిస్కెట్ పరిశ్రమలను సందర్శించారు. విద్యార్థులు మొక్కల నుంచి తీసిన వివిధ పదార్థాల ద్వారా జిందాతిలిస్మాత్ తయారీ, పార్లే కంపెనీ తయారీ చేస్తున్న వివిధ రకాల బిస్కెట్‌ల తయారీని, నాణ్యత గురించి ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ పెరియాల సాకేత్ రామారావు మాట్లాడుతూ ఫుడ్‌సైన్స్, న్యూట్రిషన్ విద్యార్థులకు పరిశ్రమలను, పరిశోధన కేంద్రాలను సందర్శింపజేస్తూ, ప్రయోగాత్మక విద్యను అందించటమే కిమ్స్ విద్యాసంస్థల ధ్యేయమని అన్నారు. కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్, సందర్శనలు ఉద్యోగాల దృష్ట్యా కిమ్స్ కళాశాలకు ఫుడ్ సైన్స్ కి సంబంధించిన అన్ని పరిశ్రమలతో పరిచయాలు ఉన్నాయని తెలిపారు. విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు అంజలి, మహేశ్వరి, ప్రణయ, తిరుపతి పాల్గొన్నారు.



హుజూరాబాద్‌రూరల్: తుమ్మనపల్లి గ్రామంలో నెత్తిన బోనాలతో తరలివస్తున్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో గ్రామంలోని వీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు చెల్లించారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు.

సంస్కృతి సాంప్రదాయాలకు బోనాలు ప్రతీక



గంగాధర: ఆలయంలో పూజలు చేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


గంగాధర: పండుగలు, బోనాలు, జాతరలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటినుంచి మహిళలు నెత్తిన బోనంతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

‘పచ్చి’వడ్ల మోసం

- ఇటు పంట కోయగానే అటు కాంటా
- క్వింటాల్‌కు రూ.1,850 చొప్పున కొనుగోలు
- కొత్త దందాకు తెరలేపిన దళారులు



రోడ్డుపై పచ్చి వడ్లు తూకం వేస్తున్న వ్యాపారులు



గతంలో పోలీసులు పట్టుకున్న పచ్చి వడ్ల లారీ

జమ్మికుంట: పచ్చి వడ్లపై దళారుల కన్నుపడింది. పంట కోస్తుండగానే మాయమాటలతో కల్లాల వద్దే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కొత్త దందాకు తెరలేపారు. రైతుల కష్టాన్ని పచ్చి వడ్ల కొనుగోలు పేరుతో సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.

సీఎంఆర్ కోసమే..

గత ప్రభుత్వం సీఎంఆర్(కస్టమ్స్ మిల్లింగ్ రైస్) కోసం అప్పగించిన ధాన్యంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లు అడ్డదారిలో పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిషన్ల ద్వారా పచ్చి వడ్లను మరాడించి సీఎంఆర్ లెక్కల్లో చూపేందుకు చాటుగా పచ్చివడ్ల వ్యాపారం చేస్తున్నారు. జమ్మికుంట పట్టణం, మండలం పరిధిలోనే కాకుండా జిల్లాల్లో పచ్చివ్యాపారం జోరుగా సాగుతుంది. గతంలో పోలీసులు లారీలను పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. జమ్మికుంటకు వివిధ మండలాల నుంచి రాకపోకలు ఉండడంతో జమ్మికుంట కేంద్రంగా వ్యాపారం సాగుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు, అమ్మకాలు, అక్రమ వ్యాపారాలకు అడ్డగా మారుతోంది. తాజాగా ఎన్నడు లేని విధంగా ఎలాంటి అనుమతి లేకుండా పచ్చివడ్ల వ్యాపారం కొనసాగుతుంది. ధాన్యం అమ్మకానికి తంటాలు పడుతున్న రైతులను ఆసరా చేసుకొని దళారులు దందా మొదలుపెట్టారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో జాప్యం ఆసరా చేసుకొని రైతుల కల్లాల వద్దే పచ్చి వడ్ల కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే మూడు నుంచి నాలుగు వందల వరకు తేడా ఉంటోంది. లారీకి లక్ష రూపాయల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా క్యాన్వసింగ్, దళారుల ఏజెంట్ల కనుసన్నాలల్లో నడుస్తోంది. క్యాన్వసింగ్ నిర్వాహకులు ఏలాంటి నిబంధనలు పాటించకుండా జీరో దందా సాగిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అక్రమంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి రాష్ట్రం దాటిస్తున్నారు. ఇప్పటి వరకు చెక్‌పోస్టుల్లో పచ్చివడ్లు కొనుగోలు వ్యాపారం చేస్తున్నా ఎలాంటి రుసుం చెల్లించినట్లు దాఖలు లేవు. దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండిపడుతోంది. అడ్డుకున్న అధికారులకు మామూళ్లతో మచ్చిక చేసుకుంటున్నారని సమాచారం.

రూ.1,850కి విక్రయించిన



నాలుగెకరాల్లో వరి వేశాను. ఇరవై రోజుల క్రితం పంట కోశాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరుగుతోందని, ఆరబోసి అమ్ముదామంటే సమయం పడుతుంది. అందుకే పచ్చివడ్లను ఎలాంటి ఖర్చులు లేకుండా క్వింటాల్‌కు రూ.1,850 చొప్పున ఎనభై క్వింటాళ్లు విక్రయించాను.

– వేల్పుల తిరుపతి, రైతు, మాచనపల్లి, జమ్మికుంట

మద్దతు ధరకు కొనుగోలు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తాం. తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపోవద్దు. ధాన్యం రవాణాపై మార్కెటింగ్ ఫీజులు వసూలు చేస్తాం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం తనిఖీలు చేసి రికార్డులు చూపనివారిపై చర్యలు తీసుకుంటాం.

– గుగులోతు రెడ్యానాయక్, జమ్మికుంట మార్కెట్ కార్యదర్శి

బీజేపీ నాయకుల ప్రచారం



చిగురుమామిడి: మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేసి రెండోసారి గెలిపించాలని ఇంటింటికీ తిరిగారు. అసెంబ్లీ కో ఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, మోదీ నాయకత్వానికి ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని, ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. ప్రపంచంలో భారత్‌ను ఐదో ఆర్థిక శక్తిగా నెలబెట్టిన ఘనత మోదీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు రావుల రవీందర్, పత్తేం మొగిలి, మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయ, నాయకులు రజనీకాంత్, శ్రీమూర్తి తిరుపతి, లత, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ నాలుగు లక్షల మెజార్టీతో విజయ దుందుభి మోగిస్తారు

శంకరపట్నం: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ నాలుగు లక్షల మెజార్టీతో విజయ దుందుభి మోగిస్తారని బీజేపీ అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి అన్నారు. మండలంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌లో అభివృద్ధికి పనులకు సంజయ్ రూ.12 వేల కోట్లు మంజూరు చేయించారని, ప్రజలు బీజేపీకి ఓటేసి అధిక మెజార్టీతో గెలిపిస్తారని జోస్యం చెప్పారు. ఈకార్యక్రమంలో మాడ వెంకట్‌రెడ్డి, అనిల్, నరేందర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, వీరార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొన్నం పెళ్లిరోజు వేడుకలు

చొప్పదండి: పట్టణంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పెళ్లి రోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, పురం రాజేశం, నిజానపురం చందు, మునిగాల సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: మండల కేంద్రంలో పొన్నం ప్రభాకర్ పెళ్లిరోజు వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతీ ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలతో మమేకమైపోతారని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, నాయకులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, పోటు మల్లారెడ్డి, బుర్ర శ్రీనివాస్, బెజ్జంకి అంజయ్య, కవ్వంపల్లి సంజీవు, జిల్లెల్ల రమేశ్, పాతర్ల శివాంజనేయులు, గూళ్ల రాజు, మొండయ్య పలువురు పాల్గొన్నారు.


ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చొద్దు



మాట్లాడుతున్న పూసాల సంపత్

కరీంనగర్: ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చితే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా ఎదిగిన కులాల వారు బీసీ-ఏ లోని రిజర్వేషన్లను అనుభవించాలనుకోవడం సరైనది కాదని అన్నారు. రజకుల భావితరాల భవిష్యత్‌ను రాష్ట్రప్రభుత్వం దెబ్బతీయొద్దని తెలిపారు. గతంలో డీగ్రూప్‌లో ఉన్న ముదిరాజులను అప్పటి కాంగ్రెస్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం బీసీఏలో చేరిస్తే రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి అప్పటి జీవో 15 రద్దు చేయించానని తెలిపారు. ఈ విషయాన్ని జాతీయ బీసీ కమిషన్‌కు కూడా విన్నవించామని, రాష్ట్ర ప్రభుత్వం వీరి చేరిక ప్రయత్నాలు విరమించుకోవాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెనక్కి తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో వనపర్తి శంకర్, జంపాల నర్సయ్య, మల్లుగారి నర్సింహ, గంగం రవి, నర్సయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

కరీంనగర్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా పంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో రెండు నెలల నుంచి 10 నెలల వరకు వేతన బకాయిలు పెండింగ్‌లు ఉన్నాయని తెలిపారు. దీంతో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, ఉపాధ్యక్షుడు కాశిపాక శంకర్, జిల్లా కోశాధికారి ఎండీగా రవీందర్‌రావు, కమిటీ సభ్యులు సదయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ, మహంకాళి కొమురయ్య, సారయ్య, మధు, కొమురయ్య, కార్మికులు పాల్గొన్నారు.



సైదాపూర్: ఉపాధ్యాయులతో వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 1993 పదో తరగతి విద్యార్థులు

అ‘పూర్వ’ విద్యార్థుల సమ్మేళనం

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 1993 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముప్పై ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం, సన్మానం చేశారు.

గంగాధర: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని ఓ పాఠశాల 2009-10 విద్యా సంవత్సరం పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం రవిశంకర్ దంపతులను విద్యార్థులు సన్మానించారు.



మాజీ ఎమ్మెల్యే, స్కూల్ కరస్పాండెంట్ సుంకె రవిశంకర్ దంపతులను సన్మానిస్తున్న విద్యార్థులు

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ అరికట్టాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవీందర్



శంకరపట్నం: తాడికల్‌లో పేరుకుపోయిన ధాన్యం

గన్నేరువరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బామండ్ల రవీందర్, కార్యదర్శి మాష ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గునుకులకొండాపూర్, జంగపల్లి, గోపాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోళ్లను ఆదివారం పరిశీలించారు. బస్తాపై రెండు నుంచి ఐదుకిలోల వరకు అదనంగా కటింగ్ చేస్తున్నారని, ధాన్యం తూకం వేసిన తర్వాత రైతుకు కనీసం రశీదు కూడా ఇవ్వడం లేదని, కటింగ్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులకు సంబంధం ఉండటంతోనే తతంగం కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో జరిగినట్లే ఈ ప్రభుత్వం హయాంలోనూ దోపిడీ సాగుతోందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కోతలు లేకుండా కొనుగోళ్లు చేపట్టి హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, రైతులకు 24 గంటల్లో ధాన్యం డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతుండటంతో సెంటర్‌లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు త్వరగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

సొంతంగా ప్రాజెక్టులు చేయాలి



ట్రైనర్స్‌కి జ్ఞాపికలందిస్తున్న కళాశాల డైరెక్టర్ శంకర్

హుజూరాబాద్‌రూరల్: సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై కిట్స్ సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా మాట్లాడుతూ... కొత్త ఆవిష్కరణలకు సమాచారం గుండెకాయ వంటిదని, ఆటోమేషన్ ద్వారా పరిశ్రమల సామర్థ్యం పెరిగిందని ఒక్క ప్రోగామ్‌తో లెక్కలేనన్ని వస్తువులను నిరంతరంగా తయారు చేయవచ్చన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో సమాచారం క్రోడీకరించి విశ్లేషించాలని, విద్యార్థులు వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొంతంగా ప్రాజెక్టులు చేయాలని, చిన్నచిన్న ప్రాజెక్టులు చేసినా కూడా భవిష్యత్‌లో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ట్రైనర్స్‌కి జ్ఞాపికలు, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ రవీంద్రబాబు, హైదరాబాద్ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రేస్ విసన్, శిక్షకులు విజయ్, సురభి, కార్యక్రమ సమన్వయకర్తలు ఉన్నారు.

నకిలీపత్రాలతో భూవిక్రయం

కరీంనగర్‌రూరల్: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాకుండా ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించిన వ్యవహారంలో నలుగురు వ్యక్తులపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు పరారీలో ఉండగా.. మరో ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల మేరకు.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య(54) పవర్‌లూమ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. తీగలగుట్టపల్లిలోని సర్వే నంబరు -233/ఈలో ప్లాట్ నంబరు 16లోని 293.33 చదరపు గజాల స్థలాన్ని 2003 సంవత్సరంలో మూల గౌరారెడ్డి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం గౌరారెడ్డి మృతిచెందడంతో కొడుకు మూల తిరుమలరెడ్డి గతంలో విక్రయించిన ప్లాట్లకు సంబంధించి 50 అడుగుల రోడ్డును ఆక్రమించి రెండు ప్లాట్లుగా విభజించి తల్లి వీరమ్మ పేరిట ధ్రువపత్రాలు సృష్టించి మూల సూర్యప్రకాశ్‌రెడ్డి, లంక శేఖర్‌కు విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు విచారణ చేపట్టి నలుగురిపై కేసు నమోదు చేశారు. తిరుమలరెడ్డి, శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఇద్దరు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ వైరు పట్టివేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామంలో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ వైరును పట్టుకున్నట్లు సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి వద్ద 200 జెలిటన్ స్టిక్స్, పది డిటోనేటర్స్ వైరు ఉన్నట్లు సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకున్నామని, సదరు వ్యక్తిని విచారించగా పట్టణానికి చెందిన తనకు తెలిసిన వ్యక్తి దగ్గర పేలుడు పదార్థాలను కొనుగోలు చేసి వాటి ద్వారా గుట్టలను పేల్చి క్రషర్లకు అక్రమంగా అమ్ముతున్నట్లు తెలిసిందని, ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్సై వివరించారు.